‘వదిన పాతికకు ఇంకో పాతిక వేసి అతని చేతిలో పెట్టింది.’

# వదిన - గొలుసు

[ చిన్నకథ ]

రచయిత :

## ద్రోణంరాజు నరసింహారావు

అది జ్యేష్టమాసం. మిట్టమధ్యాహ్నం. నిప్పులు గక్కుతోంది యెండ. ఇట్టివేడి యెన్నడూ యెరుగమన్నారు ముసలివాళ్ళందరూ. గాడుపం టేగాడుపా! జనం నాలుగు వైపులా మృత్యువుతో ఆడుతున్నారన్నమాట. నేల కాలిన పెనంలా మాడిపోతూఉన్నది. ఇంటిలో నుండి బయటకురావడం అంటే మృత్యుముఖానికి తిన్నగా వెళ్ళడమే

ఈసమయాన్నే తన మోటారును నడుపుకుంటూ గాలిలో యెగిరిపోతున్నాడు- ఆబీడీల కార్ఖానా యజమాని. ఆకార్ఖానాఅంటే సామాన్యమైన దనుకుంటారేమో- కాదు- దానికి ఇండియాలో చాలా గొప్పపేరుంది... సుశీల్ బాబు ...ఇదే ఆతని పేరు.

‘ఆహా, అదృష్టంకూడా ఎంత గొప్పది! ఇదివరలో నే నెక్కడుండేవాడిని, ఇప్పు డెక్కడున్నాను! వాళ్లు ఎక్కడుండేవాళ్ళు! ఇప్పు డెక్కడున్నారు! వదిన ఎంత మంచిది! ఈస్థితికి వచ్చినప్పటికి ఆ గొలుసును అమ్ముకోలేదే!! ఆ గొలుసు మూలకంగానే ఈవేళ మేము కలుసుకోగలిగాము. సరే, ఆఖరుకు ఆయన ఉండేదెక్కడ? ఆయనకు నౌకరీఊడిందనీ, మళ్ళీ నౌకరీ దేవుల్లాటల్లో ఒక్కనరం అయిపోయారనీ, చప్పిదవళ్ళుపడ్డాయనీ, ముక్కు మూరెడయిందనీ, కళ్ళు గుంటలుపడి భయాన్ని గొలుపుతున్నాయనీ, తాను గడ్డి అమ్ముకొని నాలుగుడబ్బులు తెచ్చుకుంటూ అందులోనే ఇద్దరం కాలక్షేపంచేస్తున్నామనీ చెప్పింది వదిన. ‘అయ్యో! వాళ్ళ కిట్టిస్థితి వచ్చినది! ఆయనను ఈరూపంలో గుర్తుపట్టగలనా? భగవాన్! ఈవదిన యింతకుముందే నాకు అగుపడినయెంతబాగుండేది?

‘ఇంతజోరుగా మోటారుతీసుకు పోతున్నా! ఎక్కడకో నాకే తెలియదు. ఆయనను ఎక్కడని వెతకను? యెక్కడదొరుకుతాడు? నేనైతే......’

అకస్మాత్తుగా పడిందతని దృష్టి ఒక బాటసారిమీద. బక్కచిక్కినశరీరం, చినిగినగుడ్డ, చింకిజోడు, అడుగు లెక్కపెడుతూ నడవడం! అంతే, అతడు చప్పున బ్రేక్ వేశాడు. కారాగింది. బాటసారి ఉలిక్కిపడి రెప్పవాల్చకుండా చూడసాగేడు. కారునుండి దిగాడు సుశీల్. బాటసారిని ఎగాదిగా పారజూడ నారంభించాడు. భయంచేత ఆబాటసారి వెనక్కి వెనక్కి తొంగ మొదలుపెట్టేడు. పాపం, భయంవేసింది! బీదవళ్ళని అనుగడుక్కే వేధిస్తూ ఉండేది భయమేగా! ‘అన్నయ్యా! అన్నయ్యా!! నేను మిమ్మల్ని చాలాకష్టపెట్టేశాను, అన్నయ్యా!!!’’ అన్నాడు పట్టరాని సంతోషంతో సుశీల్.

ఇద్దరూ సయానా అన్నదమ్ములే!

వారికథ ఇది—

* * *

‘‘ఇదిగో, వదినా! నేను చూస్తున్నాను, ఇంక యీయింటిలో నిర్వహించడము కొంచెం దుర్భరంగానే ఉండేలాగున్నది. మిమ్మల్నిగురించి

నీకుకూడా అనవసరంగా విరోధం వస్తోంది."

"ఏమిచేస్తాం, బాబూ! ఆయన స్వభావమే ఇట్లాఅయిపోయింది."

"కాదు వదినా! మరీ అంధకారం అయిపోతోంది. ఈయింట్లో అశాంతికి కారణం మేమే. ఇంట్లో యెప్పుడూ శాంతి ఉండేలాగున చెయ్యాలి."

"చూడు, సుశీల్! నేను వచ్చేటప్పటికి నువ్వు కేవలం పిల్లవాడివి. నిన్ను కొడుకులాగున పెంచాను. నువ్వున్నూ నన్ను తల్లిగానే భావిస్తూవచ్చావు. ఇటువంటప్పుడు మీరంతా యింట్లోనుండి వెళ్ళిపొమ్మని నే నేముఖంపెట్టుకుని అనకలుగుతాను? ఆయన అంటారు. అంటే అననీ, నాతోనే అంటున్నారుగా. సాగినంతవరకు సాగనీ-"

సురేశ్‌బాబు సుశీల్‌బాబు యిద్దరూ అన్నదమ్ములు సయానా. సురేశ్ ఇంటరువరకూ చదివాడు. భీమాకంపెనీలో నౌకరీచేస్తున్నాడు. సుశీల్ తన అన్నమూలాన్ని యెక్కువ చదువలేక పోయాడు. సురేశ్ సంపాదించి తెచ్చి తనభార్యకిచ్చేవాడు. ఆమె, సుశీల్ యిద్దరూ ఆతెచ్చినదానితో సంసారం గడిపేవారు.

సురేశ్‌కి పిల్లా పీచూ సున్న. కాని అపరకుచేలుడు, సుశీల్. ఇతనికున్నారు పాపుడజనుమీద ఇంకా ఒక టెక్కువే.

వదిన ఆపిల్లకాయల్ని లాలిస్తూ ఉంటుంది. వాళ్ళకు పెట్టడం, పొయ్యడం అంతా ఈమెయే. సుశీల్ భార్యయింట్లో వంటచేసి పెట్టేదం దరికి. ఇదే వాళ్ళిద్దరి కార్యక్రమం.

*  *  *

"అనేకసార్లు చెప్పా—వాళ్ళని వెళ్ళిపొమ్మని చెప్పమని—ఇక్కడ ఊరికే బేవార్సుగా ఏమన్నా ఉందా? మొదట్లో యిద్దరుండేవాళ్లు. ఇపు డారుగురయారు. శాబాసు! ఆరుగురికా, ఖర్చు! ఉహు- నా వల్లకాదు. అయితేమాత్రం యెందుకిస్తా? తాతముత్తాతలేమయినా దాచపెట్టి పోయారా? నీతో వేయిసారులుచెప్పాను. కాని నువ్వుమాత్రం ఏమీ అనడమేలేదు- చెప్పు, వెళ్ళగొడుతావా లేదా? ఈవేళ-'

ఆమె యేమీ మాట్లాడిందికాదు.

"సరే, తెలుసుకున్నా- నే నింకా కొంచెం ముందుకు పోవాలి. సరే ఇదీ బాగానేఉన్నది. చూడూ, ఈరోజు యింట్లో ఖర్చంతా బంద్. వాడిపక్షాన్ని ఉంటున్నావు గనుక నువ్వుకూడా వాడినే అడిగి తిను." అన్నాడు సురేశ్ పళ్ళుపటపట లాడిస్తూ.

"నే నెవరిపక్షం ఉండను. కాని న్యాయపక్షాన్నిమాత్రం తప్పకుండా ఉండితీర్తా. సుశీల్ నౌకరులా రాత్రనక పగలనక బజారుపనులన్నీ చేస్తున్నాడు. మొదట్లో యీపని కోసం నౌకరుండేవాడు. వాడిని తీసిపారేశాము. ఇంట్లో అతని భార్య ఇంటిపనంతా చేస్తోంది. ఇంతకుముందు ఆచోట వంటలక్క ఉండేది. వాళ్ళిద్దరూ ఊరికే తేరగా ఏమీ తినడంలేదు. పోనీతింటున్నారే అనుకుందాము. అయితే మాత్రం ఏమి? పరాయులుకారుగా! మీవాళ్ళేగా! ఆఖరుకు మీరిద్దరు ఒక్కమ్మకడుపున పుట్టినవారేగా! ఇంక ఆపిల్లలా? వాళ్ళుమాత్రం పరాయివాళ్లకు చెందారా? ఎప్పుడైతే ఆ.........

"ఓసీ-" కోపంతో చూస్తూ- "నాకే చెప్పవచ్చావ్! అట్లే కాదన్నావా అంటే నేనుకూడా దారి పట్టవలసి ఉంటుంది." అంటూ పాంకోళ్ళు టిక్కుటక్కుమనిపించుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు సురేశ్.

ప్రక్కగదిలోనే కూర్చున్నది సుశీల్ భార్య ఇదంతావింటూ. ఇతరరోజులలో ఇటువంటి మాటలు వినిచాలా విలపిస్తూ ఉండేది. కాని యీవేళ ఆమెలో ఒక విచిత్రమైన మార్పుకనుపించింది. ఇప్పుడు ఆమె ముఖంమీద ఆత్మగౌరవం, ఆత్మసన్మానం కావలసినంత చిలకరించాయి. తక్షణం సుశీల్‌ని పిలిచింది. సంగతులన్నీ చెప్పేసింది.

సుశీల్ కేవలం పసికందుమాదిరి ఏడవడం మొదలుపెట్టాడు.

"ఛీ, ఏడుస్తున్నారేమిటి?" అన్నది, భార్య—"ఏడవడం ఆడవాళ్ళపని. మీరు మగవారు. ప్ర

యత్నం చెయ్యాలి, ఉపాయంచూడాలి." అన్నది. కాని అత డూరుకోలేదు. ఓదారుస్తూన్న కొద్దీ ఏడ్చేవానికి ఏడుపు మరీ యెక్కువౌతుందిగా! వెక్కిళ్ళువచ్చేదాకా యేడిచాడు. ఓదార్చగా ఓదార్చగా చివరకు ఊరుకున్నాడు. భార్య ఒక బంగారపు గొలుసుతీసి యిచ్చింది. ఇదొక్కటే ఆమె పుట్టింటి సంపత్తి. "పోయి దీనినమ్మి రూపాయలు తెండి." అని చెప్పింది.

"ఆరూపాయలతో ఏమవుతుంది?" అని అడిగా డతడు వెక్కి-వెక్కి యేడుస్తూ.

"చాలు, రూపాయలు తీసుకు రండి, తరువాతపని నేనుచేస్తా."

అతడు వెళ్లాడు.

దారిలోనే వదిన కనుపడినది. బహుశా ఆమె యీసంగతులన్నీ వింటూనే ఉన్నదేమో!, "దీనిని తీసుకొని ఎక్కడకు వెళ్ళుచున్నావు సుశీల్?" అని ఆమె అడిగింది.

దాపరికం ఏమీలేకుండా సంగతంతా చెప్పేశాడు సుశీల్‌బాబు. వదిన నచ్చచెప్పడం ప్రారంభించింది. కాని యెన్ని చెప్పినా సుశీల్ ససేమన్నాడు.

"సరే, నీ కిప్పు డెన్నిరూపాయలు కావాలి?"

"ఈవిషయము అడిగిచెపుతా" నని తత్తరపాటుతో అతడు జవాబిచ్చాడు.

వదినదగ్గరకు తిరిగివచ్చాడు. మళ్ళీ పాతికరూపాయలు కావాలన్నాడు.

వదిన పాతికకు ఇంకోపాతిక వేసి అతని చేతిలో పెట్టింది. సుశీల్ గొలుసు యివ్వబోయాడు. ఆమె గట్టిగా కోపపడింది.

"నేను వేరుకాదు వదినా! నువ్వుచేసిన ఉపకారాలు మరచిపోతానా? కృతజ్ఞతతో ఉన్నాను. ఎప్పుడూ ఉంటాను. కాని నువ్వు గొలుసు తప్పకుండా ఉంచుకోవాలి.' అన్నాడు.

ఇంకా ఎన్నో మాట్లాడారు. తుదకు గొలుసు కుదువగా ఉంచుకోక తప్పినదికాదు.

అంతే, సుశీల్ ఆరాత్రే బయలుదేరాడు పిల్లాజల్లా సహితంగా, ఇంటికిఅయిదుక్రోసులదూరంలోనే ఉన్నది ఒక పెద్దపట్టణం. అక్కడ యిల్లొకటి బాడుగకు తీసికొన్నాడు.

నాలుగురోజులు గడిచాయి. తరువాత "ఇలా కూర్చుంటే సాగేదెల్లా"గన్నది భార్య.

సుశీల్ చిరునవ్వుతో జవాబిచ్చాడు "ఏమిచెపుతే అదిచేస్తా" నని.

"బజారునుంచికొంచెం పుగాకు తెండి, కొద్దిగా తునికాకుకూడా. మీరీమాత్రం చేస్తేచాలు. మిగతా పనంతా నేనే చక్కపెట్టుకుంటా."

పిల్లలు పుగాకు, ఆకులు తయారుచేయసాగారు. ఇద్దరూ బీడీలు చేస్తూఉండేవారు. సాయంకాలానికి అతడు యిల్లిల్లూతిరిగి అమ్ముకొనివచ్చేవాడు. చూస్తూచూస్తుండగానే అతనికే తనబీడీలప్రచారంవల్ల ఆశ్చర్యం కలుగ నారంభించింది. ఈబీడీలు చాలామంది రుచిమరిగారు. అత డమ్మడానికి వెళ్లేసరికల్లా బజారులో కొంతమంది తనకొరకు డబ్బుపుచ్చుకుని ఎదురుచూస్తూ ఉండేవాడు. కార్యసాఫల్యానికి అతనికి చాలా ఆనందం కలిగింది. జనులలోని ఆసక్తిచూచి దుకాణదారులుకూడా అతని బీడీలను దగ్గరఉంచుకొనసాగారు. మరికొన్నాళ్ళకు దుకాణదారులు కొంత అడ్వాన్సుతో సహా అతనిగుమ్మం కాచుకొని ఉండడము దృష్టిగోచరమయ్యేది. ఉత్పత్తికంటె ఖర్చు అపరిమితంగా పెరిగిపోయింది. అప్పుడు అతడు చాలామంది నౌకర్లను పెట్టుకోవలసి వచ్చినది.

* * *

వ్యాపారంలోనే లక్ష్మి ఉండేది. సుశీల్ అంటే యిపుడు సుశీల్‌గా లేడు. ఆపట్టణంలోనే అతని దుకాణాలెన్నో నడుస్తున్నాయి. ఇందుకోసం ఒక కార్ఖానాకూడా వెలిసింది. అందులో వేలకొలది పనివాళ్ళు పనిచేస్తున్నారు. దాదాపు పెద్దపెద్ద పట్టణాలన్నిటిలోను అతని ఏజెన్సీలు తెరువబడ్డాయి. ఇంత అయినప్పటికీ అతని పరివారంలో మార్పుఏమీ కలుగలేదు. ఇంకా ఆరెండు ప్రాణాలూ చమటోడ్చి పనిచేస్తూనే ఉన్నాయి. పిల్లకా

యలుమాత్రం చనువుగా ప్రవేశించారు.

* * *

సుశీల్ బాబు కార్ఖానా మేనేజరు యింటిలో అతని గుఱ్ఱంకోసము గడ్డిఅమ్ముకునేస్త్రీ ఒకతె చాలా రోజులనుంచి గడ్డివేస్తూఉన్నది. ఏవో కొన్నిడబ్బులు దొరికేవి. అవి తీసుకువెళ్లిపోయేది. ఆనాడుకూడ ఆమె యథాప్రకారంగా గడ్డితీసుకు వచ్చింది. మేనేజరు తనదర్వాజానానుకుని కూర్చున్నాడు. డబ్బులు యిచ్చేసమయంలో—గడ్డి వేసే స్త్రీ తొడుగుకున్న చినిగిన చొక్కాలోపల యేదో తళుకు తళుకుమని మెరుస్తూ ఉండడం అతని కంటపడింది. అతడు దానిని నిదానించి పరికించాడు—అదొక బంగారపు గొలుసు-"ఎక్కడ దొంగిలించుకొచ్చావ్ యీగొలుసు?" అని క్రిందనుంచి పైవరకు తేరిపారచూస్తూ గద్దించాడు.

ఆమె తొణకలేదు. బెణకలేదు. ఏమీ పలుకలేదు- కన్నీటిచుక్కలుమాత్రం నాలుగు జారిపడ్డాయి. అతడు పట్టుపట్టాడు. మాటిమాటికి బెదిరింప నారంభించాడు. ఆమె మెల్లగ జారసాగినది. ఆమె కంగారుపడడం చూచాడు. సాహసం హెచ్చైంది. అంతే- తన కార్ఖానాలోనుంచి కొంతమందిని కేకవేశాడు. అంతా ఏకమై ఆమెను పీడింపసాగారు. పాపం ఆమనిషి కష్టంలో చిక్కుకున్నది. ఏమీ మారుపలుకనేలేదు- ఒకడు గొలుసు లాగుకున్నాడు. గొలుసు తెగి చెల్లాచెదరైంది. ఇంకొకడు ఆ గుళ్ళన్నీ యేరి మేనేజరుచేతిలో పెట్టాడు.

నియమానుసారం అంతా కలిసి ఆమెను తీసుకుని వెళ్లారు యజమానిదగ్గరకు.

* * *

సుశీల్ తనభార్యతో రెండవ అంతస్థులో తన అన్నగారి క్రూరత్వం, ఇంటినుండి వెడలగొట్టడం, ఆనాటి ముచ్చట్లు మాటలాడుతూ ఉన్నాడు. అకస్మాత్తుగా బయట కల్లంతు వినపడినది. అతడు మేడమీది వరండాలోనుండి తొంగిచూచాడు. కార్ఖానావాళ్ళు కొంతమంది ఒకస్త్రీచుట్టూ మూగివస్తూ ఉండడం- ముందు ముందు మేనేజరు- కనపడ్డాడు.

సుశీల్ క్రిందకు దిగివచ్చాడు.

"ఇది గడ్డివేసేమనిషి"—అని మేనేజరు గొలుసులోని గుళ్ళు సుశీల్ చేతిలో పెట్టి వికటంగా "చాలారోజులనుండి యిది నాదగ్గర గడ్డి వేస్తూఉన్నది. ఇదిగో, చూడండి, యీగొలుసు, ఇది నాభార్యది. ఈవేళ ఇది దొంగిలించింది. నా అదృష్టం బాగుండపట్టి పట్టుబడింది." అంటూ ఉపన్యసించడం సాగించాడు.

"బాగానేఉందే! గడ్డివేసేదానికేనా యీపని!" అంటూ అంతా అరిచారు-

సుశీల్ ఒక్కసారి ఆగడ్డిమనిషివైపు చూచాడు- మళ్ళీ చూచాడు, ఇంకా చూచాడు, యింకా బాగా తేరిపారచూచాడు. ఆమె ఒక పర్యాయం ఆగొలుసుగుళ్ళని, తరువాత తనను చూచుకోడం చూచాడు- ఆమెను బాగా పరకాయించాడు- అతనిముఖమంతా ముచ్చెమట్లు కమ్మాయి-

"మంచిది, మీరందరూ యిపుడు వెళ్ళండి-మరల పిలిపిస్తాను." అని మాత్రం ఎటులనో అనకలిగాడు సుశీల్ గద్గదకంఠంతో-

అందరూ వెళ్లిపోయారు వాళ్లల్లో వాళ్లేదో అనుకొంటూ. ఇంతవరకూ సుశీల్ భార్య వెనుకఉండి అంతా వింటూఉన్నది- అంతా చూస్తూనేఉన్నది- అకస్మాత్తుగా ఎదుటకొచ్చింది- వచ్చీరావడంతోనే ఆమె ఆగడ్డిమనిషి కాళ్లమీదపడి నమస్కరించింది-

మరి సుశీల్ బాబు ?


## ఆంధ్రభూమి

సచిత్రాంధ్ర మాసపత్రిక

చందావివరము :

| | |
|---|---|
| సంవత్సరమునకు | రు. 1-౬-0 |
| 6 నెలలకు | 0-12-0 |
| విడిసంచిక | 0-2-0 |